జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ‖సంపుటి:1 ‖ సంచిక: 38 ‖ మంగళవారం ‖ 7-7-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-




త్రిష-రానా బంధంపై మరోసారి చర్చ..

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:51 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి సప్తమి మ. 1:20 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర సా. 4:09 వరకు తరువాత రేవతి యోగం శోభన మ. 2:24 వరకు కరణం బవ మ. 1:20 వరకు భాలవ రా. 12:540 వరకు వర్జ్యం తె. 4:12 నుండి తె. 5:46 వరకు దుర్ముహూర్తం ఉ. 8:27 నుండి ఉ. 9:19 వరకు రా. 11:15 నుండి రా. 11:59 వరకు రాహుకాలం మ. 3:36 నుండి సా. 5:13 వరకు యమగండం ఉ. 9:06 నుండి ఉ. 10:43 వరకు గుళికాకాలం మ. 12:21 నుండి మ. 1:58 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:15 నుండి తె. 5:03 వరకు అమృత ఘడియలు ఉ. 11:31 నుండి మ. 1:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



### ఉన్నత విద్యపై సీఎం
## సమీక్ష

**సచివాలయంలో సమావేశం**

**పథకాల పురోగతిపై చర్చ**

**విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి**

చెన్నై, జులై 6

తమిళనాడు ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యకలాపాలు, సంక్షేమ పథకాల అమలుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిం చారు. చెన్నైలోని రాష్ట్ర ప్రధాన సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ (మిగతా 2వ పేజీలో)



# టూరిజం హబ్‌గా... ఫ్యూచర్ సిటీ

**అంతర్జాతీయ స్థాయిలో ఎకో పార్కులు**

**క్యూర్ పరిధిలోని అటవీ శాఖ భూముల అభివృద్ధి**

**పురానాపూల్ వంతెనలపై పర్యాటక ఏర్పాట్లు**

**వికారాబాద్ ఆలయానికి ప్రత్యేక కమిటీ**

**డిసెంబర్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్**

**పర్యాటకాభివృద్ధిపై సీఎం రేవంత్ దిశానిర్దేశం**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దేందుకు తలపెట్టిన ప్రాజెక్టుల పనులను తక్షణమే వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో పర్యాటక శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.



హైదరాబాద్, జూలై 06: భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూముల్లో అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను తరువాయి 2 వ పేజీలో..



### వనరుల వినియోగంతోనే
## సమగ్రాభివృద్ధి

**6 నెలల్లో మాస్టర్ ప్లాన్ సిద్ధం**

**మూడు ఎకనామిక్ రీజియన్లకు వేగం**

**51.88 చ.కి.మీ.లో'వైజాగ్ బే సిటీ'**

**సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి**

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సహజ, మానవ, పారిశ్రామిక వనరులను సమర్థంగా వినియోగించడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల (వీఈఆర్, ఏఈఆర్, టీఈఆర్) అభివృద్ధిపై సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే విశాఖ ఎకనామిక్ రీజియన్ మాస్టర్ ప్లాన్‌ను ప్రకటించిన ప్రభుత్వం, మరో ఆరు నెలల్లో అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల మాస్టర్ ప్లాన్‌లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది.

అమరావతి, జూలై 06: మాస్టర్ ప్లాన్‌లను తుది రూపు ఇవ్వడానికి ముందు ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సేకరించాలని, అలాగే రెండు నెలల్లో ప్రతి జిల్లాకు డిస్ట్రిక్ట్ ఎకనామిక్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల్లో ఉన్న వనరులు, అవకాశాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిలో ఉద్యానవన రంగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న సీఎం, కడప జిల్లా లింగాల మండలాన్ని కేస్ స్టడీగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉద్యాన పంటల సాగుతో అక్కడ ప్రజల తలసరి తరువాయి 2 వ పేజీలో..

### కశ్మీర్‌ను వణికించిన
## భారీ వర్షాలు

శ్రీనగర్, జులై 6

జమ్మూకశ్మీర్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు సోమవారం తీవ్ర బీభత్సం సృష్టించాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిప డగా, కిశ్త్‌వాడ్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజె క్టు ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. ప్రాజె క్టు ప్రాంతానికి వెళ్లే రహదారిపై భారీగా బురద, బండరాళ్లు పేరుకుపోవ డంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. కొండచరియలు విరి గిపడ టంతో (మిగతా 2వ పేజీలో)






### క్యాన్సర్ ఔషధ తయారీ కేంద్రం
## ప్రారంభం

**సిరో ఫార్మా యూనిట్ ప్రారంభం**

**ఫార్మా రంగానికి ప్రోత్సాహం**

**చౌకగా మందులు అందించాలి**



సిద్దిపేట, జులై 6

సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలంలోని బయోటెక్ పార్క్ ఫేజ్-3లో సిరో ఫార్మా ఆధ్వర్యంలో నిర్మించిన అత్యాధునిక ఆంకాలజీ (క్యాన్సర్) ఔషధాల తయారీ కేంద్రాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల (మిగతా 2వ పేజీలో)



### అమర్‌నాథ్ యాత్రకు
## కట్టుదిట్ట భద్రత

**సంయుక్తంగా భద్రతా ఏర్పాట్లు**

**యాత్రికులకు నిరంతర సేవలు**

**అప్రమత్తంగా భద్రతా బలగాలు**

శ్రీనగర్, జులై 6

అమర్‌నాథ్ యాత్ర--2026ను సురక్షి తంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ), జమ్మూ కశ్మీర్ పోలీ సులు, భారత సైన్యం, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు సంయుక్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాయి. యాత్రికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ అన్ని మార్గాల్లో నిరంతర నిఘా కొనసాగిస్తున్నాయి. యాత్రా మార్గాల్లో భద్రతా (మిగతా 2వ పేజీలో)



### అయోధ్య రామాలయ ట్రస్ట్‌లో
## కీలక పరిణామం

**చంపత్‌రాయ్ రాజీనామా ఆమోదం!**

**కొత్త ప్రధాన కార్యదర్శిగా బజరంగ్ లాల్ బగ్రా నియామకం**

**విరాళాల దుర్వినియోగంపై సిట్, పోలీసుల సమాంతర దర్యాప్తు**

అయోధ్య, జూలై 06: అయోధ్య రామమందిరంలో భక్తుల విరాళాల చోరీ మరియు నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు ఉధృతమైన వేళ శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేవుని విరాళాల అవినీతి కేసులో విచారణ వేగం పుంజుకోవడంతో గతనెల జూన్ 26నే తన పదవికి రాజీనామా చేసిన ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ రాజీనామాను సోమవారం జరిగిన ట్రస్ట్ తరువాయి 2 వ పేజీలో..

# నేటి రాశి ఫలాలు

మేషం : మీ ప్రయత్నాలకు అనుకూల ఫలితాలు లభిస్తాయి. మిత్రుల సహకారంతో విజయం సాధిస్తారు. ఆనందకరమైన సమయం మీ సొంతం అవుతుంది. దత్తాత్రేయ స్వామి ఆరాధన మేలు చేస్తుంది.

వృషభం : పదవీ, గౌరవ యోగాలు అనుకూలిస్తాయి. కొత్త వస్తువులు కొనుగోలు చేస్తారు. వ్యాపారంలో మంచి నిర్ణయాలు ఫలిస్తాయి. ప్రయాణాలు లాభదాయ కంగా ఉంటాయి. ఇష్టదైవ దర్శనం శుభప్రదం.

మిథునం : వృత్తి, ఉద్యోగాల్లో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. అభివృద్ధిపై దృష్టి పెడితే మేలు జరుగుతుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. ఇష్టదేవతా ఆరాధన మేలు చేస్తుంది.

కర్కాటకం : స్వల్ప ఆటంకాలు ఎదురైనప్పటికీ ధైర్యంగా ముందుకు సాగితే విజయం సాధిస్తారు. దీర్ఘకాల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. సూర్యాష్టక పఠనం శుభప్రదం.

సింహం : మిశ్రమ ఫలితాలు ఉంటాయి. పట్టుదలతో పనులు పూర్తి చేస్తారు. తోటివారి సహకారం లభిస్తుంది. సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది. ఇష్టదైవ ఆరాధన మేలు చేస్తుంది.

కన్య : లక్ష్యాలు నెరవేరుతాయి. తోటివారితో సంతోషాన్ని పంచుకుంటారు. సమాజంలో కీర్తి ప్రతిష్ఠలు సంపాదిస్తారు. ధన, వస్త్ర లాభాలు కలుగుతాయి. సూర్య నమస్కారం వల్ల మంచి జరుగుతుంది.

తుల : పట్టుదలతో కార్యసిద్ధి సాధిస్తారు. అధికారుల ఆదరణ లభిస్తుంది. తోటివారి సహకారంతో విజయాలు అందుకుంటారు. శ్రీరామ నామస్మరణ మంగళకరం.

వృశ్చికం : గత విషయాలపై జాగ్రత్త అవసరం. సంయమనంతో వ్యవహరిస్తే సమస్యలు తగ్గుతాయి. కలహాలకు దూరంగా ఉండండి. గోసేవ శుభఫలితాలను ఇస్తుంది.

ధనుస్సు : తోటివారి, కుటుంబ సభ్యుల సహకారంతో పనులు పూర్తవుతాయి. ఆర్థికంగా అనుకూలత ఉంటుంది. శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం శు భప్రదం.

మకరం : ఇష్టకార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగ, వ్యాపారాల్లో అనుకున్న ఫలితాలు సాధిస్తారు. అధికారుల సహకారం లభిస్తుంది. శివారాధన మేలు చేస్తుంది.

కుంభం : ఉద్యోగ, వ్యాపారాల్లో మిశ్రమ ఫలితాలు కనిపిస్తాయి. ఒత్తిడిని అధిగమించి విజయం సాధిస్తారు. సమాజంలో మీ పట్ల గౌరవం పెరుగుతుంది. శివారాధన శక్తిని ఇస్తుంది.

మీనం : కొన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ ఉ త్సాహంతో ముందుకు సాగితే అనుకూల ఫలితాలు పొందుతారు. అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. శ్రీరామ దర్శనం శుభప్రదం.



# టూరిజం హబ్‌గా ఫ్యూచర్ సిటీ

మొదటి పేజీ తరువాయి

పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులను అందుబాటులోకి తేవాలని సూచించారు. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల పనులను ముమ్మరం చేసేందుకు వెంటనే స్పెషల్ ఆఫీసర్లను నియమించుకోవాలని ఆదేశించారు.



### ఆకర్షణీయంగా దుర్గం చెరువు

నగరంలోని పర్యాటక ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. తారామతి బారాదరితో పాటు దుర్గం చెరువును పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలన్నారు. అలాగే మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను వెంటనే ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అద్భుతంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రధానంగా వికారాబాద్‌లోని వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, యాదగిరిగుట్ట తరహాలో ఆ దేవస్థానానికి ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేయాలని సీఎం స్పష్టం చేశారు.

### వారసత్వ వంతెనలపై పర్యాటకం

చారిత్రక వారసత్వ సంపదగా నిలిచిన పురానాపూల్ లాంటి హెరిటేజ్ వంతెనలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. అందుకోసం అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. అభివృద్ధి చేసిన తర్వాత బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే ఆయా మార్గాల్లో ట్రాఫిక్ మరో మార్గం నుంచి మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలని సూచించారు.

### సమ్మిట్ కోసం కమిటీలు వేయండి

రాష్ట్రంలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు సంబంధించి అధికారులను సీఎం ఆరా తీశారు. వచ్చే డిసెంబర్‌లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ పై వెంటనే కసరత్తు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సదస్సు విజయవంతం కోసం వివిధ శాఖల మధ్య సమన్వయానికి ఉ న్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

# అయోధ్య రామాలయ ట్రస్ట్‌లో కీలక పరిణామం

మొదటి పేజీ తరువాయి

సమావేశంలో అధికారికంగా ఆమోదించారు. ఆయన స్థానంలో కొత్త జనరల్ సెక్రటరీగా బజరంగ్ లాల్ బగ్రాకు బాధ్యతలు అప్పగించినట్లు ట్రస్ట్ వర్గాలు వెల్లడించాయి. ట్రస్ట్ ట్రెజరర్ స్వామి గోవింద్ దేవ్ గిరి ఆధ్వర్యంలో, అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్ సమక్షంలో జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో విరాళాల దుర్వినియోగంపై ప్రత్యేక దర్యాప్తు బృందం సమర్పించిన మధ్యంతర నివేదికతో పాటు ఆలయ భవిష్యత్ పాలనా విధానం, కొత్త సీఈఓ నియామకం, మరియు 2025-26 ఆర్థిక సంవత్సర లెక్కల ఆమోదం వంటి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం ఈ నిధుల గోల్‌మాల్‌పై సిట్ మరియు పోలీసులు సమాంతరంగా లోతైన విచారణ జరుపుతుండగా.. ఇప్పటికే చంపత్‌రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్‌రావుల వాంగ్మూలాలను నమోదు చేసిన అధికారులు, ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం గమనార్హం.

# కశ్మీర్‌ను వణికించిన భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ట్రక్కులు, మిల్లులు, ఇతర భారీ యంత్రాలు బురదలో కూరుకుపోయా యి. మరికొన్ని వాహనాలు భారీ రాళ్ల కింద చిక్కుకుపోయాయి. నిర్మాణానికి సంబంధించిన పరికరాలు, సామగ్రి కూడా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎన్డీఆర్ ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, భారత సైన్యం, స్థానిక రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. శిథిలాల కింద చిక్కుకున్న వాహనాలను వెలికితీసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగు తున్నాయి. ఆకస్మిక వరదలతో భారీ మొత్తంలో బురద, బండరాళ్లు ప్రాజెక్టు ప్రాంతంలోకి చేరాయని అధికారులు తెలిపారు. దీంతో నిర్మాణ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, నష్టం అంచనా వేసే పనులు కొనసాగు తున్నాయని వెల్లడించారు. ఆస్తి, ప్రాణనష్టానికి సంబం ధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ప్రజల భద్రత దృష్ట్యా కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద ప్రభావిత ప్రాంతాలకు ప్రజలు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదా రులపై కూడా బురద, శిథిలాలు పేరుకు పోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణ పరిస్థితులు మెరుగు పడే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలు పాటించాలని యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# ఉన్నత విద్యపై సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

పనితీరు, ప్రస్తుత పథకాల అమలు, భవిష్యత్ కార్యాచరణపై అధికారు లతో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఉ న్నత విద్యా రంగంలో అమలవుతున్న వివిధ పథకాల పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన ఉ న్నత విద్య అందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సూచించినట్లు సమాచారం. ఉన్నత విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాల అమలుపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. విద్యార్థులకు మరింత మెరు గైన అవకాశాలు కల్పించే దిశగా శాఖ మరిం త సమర్థవంతంగా పనిచేయాలని ముఖ్య మంత్రి సూచించారు.

## అమర్‌నాథ్ యాత్రకు కట్టుదిట్ట భద్రత

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రతి యాత్రికుడికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేస్తున్నారు. యాత్రికులకు మార్గదర్శనం చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా భద్రతా బలగాలు సిద్ధంగా ఉ న్నాయని అధికారులు తెలిపారు. యాత్ర నిరంతరా యంగా కొనసాగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచే స్తున్నాయి. సేవ, భద్రత, సౌభ్రాతృత్వం లక్ష్యంగా ఎస్ఎస్‌బీ సిబ్బ ంది యాత్రికులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ మానవతా దృక్పథంతో విధులు నిర్వర్తిస్తున్నారు. భద్రతతో పాటు యాత్రికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. యాత్ర మార్గాల్లో నిరంతర గస్తీ, తనిఖీలు, నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాల సమన్వయంతో యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు కొనసాగుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తున్న భక్తులు ప్రశాంతంగా అమర్‌నాథ్ దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. యాత్ర విజయవంతంగా కొనసాగేందుకు భద్రతా బలగాలు నిరంతరం అప్రమత్తంగా సేవలందిస్తున్నాయి.

# వనరుల వినియోగంతోనే సమగ్రాభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

ఆదాయం రూ.7.30 లక్షలకు చేరడం రాష్ట్రానికి ఆదర్శమని పేర్కొన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని, 25కు పైగా ఉద్యాన ఉ త్పత్తులు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పూర్వోదయ పథకం కింద రూ.40 వేల కోట్లు, ప్రైవేట్ పెట్టుబడుల రూపంలో మరో రూ.60 వేల కోట్లు ఉద్యానవన రంగానికి ఊతమిస్తాయని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను పెద్దఎత్తున తీసుకురావడం ద్వారా రాయలసీమ ప్రజల జీవన ప్రమాణాలు మారుతాయని, జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### అమరావతి--విశాఖ--తిరుపతిపై దృష్టి

విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో 51.88 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ బిజినెస్--ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్, గ్లోబల్ టాలెంట్--ఎలైట్ లివింగ్ అనే మూడు ప్రధాన అంశాలపై ఈ బే సిటీని అభివృద్ధి చేయాలని సూచించారు. ఇందులో 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో మొత్తం 49 ప్రాజెక్టులు ఉ ండగా, వాటిలో 18 ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయని, మరో 12 ప్రాజెక్టులు త్వరలో ప్రారంభం కానున్నాయని, 19 ప్రాజెక్టులు ప్రణాళిక దశలో ఉన్నాయని తెలిపారు. వచ్చే మూడు నెలల్లో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. అరకు--పాడేరు--విశాఖను ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని, సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని, వెల్నెస్ సెంటర్ల కోసం ప్రత్యేక భూ కేటాయింపులు చేయాలని సూచించారు. అమరావతి ఎకనామిక్ రీజియన్ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర బిందువుగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రాష్ట్ర జనాభాలో 32 శాతం మంది ఈ రీజియన్‌లో నివసిస్తుండగా, భౌ గోళికంగా ఇది రాష్ట్రంలో 33 శాతం విస్తీర్ణాన్ని కలిగి ఉందని అధికారులు వివరించారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాలు ఈ రీజియన్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. జిల్లాల వారీగా అభివృద్ధి వ్యూహాలపై వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని, ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు కొల్లేరు సరస్సు సామర్థ్యాన్ని కూడా సమర్థంగా వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లాలని చంద్రబాబు అన్నారు. ఖనిజ సంపద, ఉద్యానవన రంగం, ఆధ్యాత్మిక కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు, విద్యా సంస్థలు రాయలసీమకు ఉన్న ప్రధాన బలాలని పేర్కొన్నారు.

తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలు, ఐఐటీ వంటి విద్యాసంస్థలు, గోల్డ్, ఐరన్ ఓర్, లైమ్ స్టోన్ వంటి ఖనిజ వనరులను అభివృద్ధికి ఉ పయోగించుకోవాలని సూచించారు. గండికోట, హార్స్లీ హిల్స్, తలకోన వంటి పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేయాలని చెప్పారు. శ్రీసిటీ దేశంలోనే నంబర్ వన్ ఇండస్ట్రియల్ పార్క్‌గా ఎదిగిందని, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు తిరుపతి రీజియన్ అనుకూలమని పేర్కొన్నారు. ఇచ్ఛాపురం నుంచి చెన్నై వరకు నాలుగు వరుసల రైల్వే మార్గం ఏర్పడుతున్న నేపథ్యంలో మౌలిక వసతులను వినియోగించుకుని రీజియన్‌ను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు.

స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాల మేరకు రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే కార్యాచరణలో భాగంగా తిరుపతి ఎకనామిక్ రీజియన్ వాటాగా 0.90 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. టీఈఆర్ అభివృద్ధి కోసం ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలను సమగ్రంగా అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి, విశాఖ, తిరుపతిలో ప్రైవేట్ భాగస్వామ్యంతో స్పోర్ట్స్ సిటీలను అభివృద్ధి చేసి అంతర్జాతీయ క్రీడా పోటీల నిర్వహణకు అనుకూలంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మూడు ఎకనామిక్ రీజియన్ల పురోగతిపై ప్రతి రెండు నెలలకు ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మూడు ఎకనామిక్ రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్వేత సంపాదకీయం

**సోమవారం 6-7-2026**

## హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

కుళ్లిన ఆహార పదార్థాలు, బొద్దింకలు, చెత్తా చెదారం నిండిన కిచెన్, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, ఇలా ఒక్కటేమిటీ అన్నీ కంపే. ఇటీవలి కాలంలో తెలంగాణ రాజధ్మాని ఘనత వహించిన హైదరాబాద్‌లో వరుస దాడుల్లో మన హోటళ్ల బండారం బయటపడింది. ఆకలితో నకనకలాడుతున్న వారంతా ఆవురావురుమని తింటున్న ఆహారపదార్థాలు కుళ్లిన, కాలం చెల్లిన పదార్థాలతో తయారు చేస్తున్నారని అధికారులు బయట పెట్టారు. ఎంతో నమ్మకంతో హోటల్‌కు వెళ్లిన వారికి ఇలాంటి తిండి పెడుతూ కోట్లు వెనకేసుకుంటున్న హోటళ్లను మూసేయాల్సిందే. వారిని వెనక ఉండి నడిపిస్తున్న రాజకీయ నాయకుల భరతం పట్టాల్సిందే.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిని అస్సలు వదలకూడదు. ఎందుకంటే వీరి వండివారుస్తున్న తిండి వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొత్త కొత్త జబ్బులు కొని తెచ్చుకుంటున్నారు. ఇవన్నీ గుర్తించి ఇలాంటి హోటల్ వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప హైదరాబాద్ పరువు కాపాడుకోలేం. ఇటీవల నగరరంలో వరుసగా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి వందల కేసులు నమోదు చేశారు. ప్రఖ్యాత హోటళ్లలోనే కంపు కొట్టేలా కిచెన్‌లు ఉంటున్నాయి. కుళ్లిన మాంసాన్ని ఫ్రీజర్‌లో పెట్టి వండి మన ముఖాన పడేస్తున్నారు. ఇకపోతే మేక మాంసంలో ఎద్దుమాసం కలిపి అమ్ముతున్న వారు హోటళ్లకు కూడా దానిని సరఫరా చేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే హైదరాబాద్ హోటళ్లు అంటేనే భయమేసేలా దారుణమైన పరిస్థితి తయారయ్యింది. కొంతకాలం పాటు ఎవకవరు కూడా హోటల్‌కు వెళ్లకుండా ఉంటే వారు దారికొచ్చేలా ఉన్నారు. ప్ర.ంలో హైదరాబాద్ అంటే ఎంతో పేరుంది. పర్యాటక రంగంలో ప్రపంచంలో మంచి స్థానం సంపాదించుకుంది. అంతర్జాతీయ పెట్టుబడులన్నీ హైదరాబాద్‌లోనే పెడుతున్నారు. ఐటి రంగంలో బాగా విస్తరించింది.

అనేక అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. దీంతో దేశవిదేశీయులు అనేకమంది ర ఓజూ హైదరాబాద్ సందర్శనకు వస్తుంటారు. ఇలాంటి ప్రతిభ ఉన్న భాగ్యనగరం కాస్తా మసకబారిపోతోంది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు ఇలా కుళ్లిన, కాలం చెల్లిన ఆహార పదార్థాలను వండిపెడితే వారి ఆరోగయం ఏం కాను. మనం తినే ఆహారం పరిస్థితి దారుణంగా ఉ ందన్న నిజాలు దాడులతో తెలిసింది. ఇటీవలి కాలంలో వరుసగా ఆహార భద్రతా అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో వెలుగుచూసిన దృశ్యాలు చూ స్తుంటే, మనం తింటున్నది ఆహారమా లేక విషమా అనే భయం కలుగుతోంది. ఒకవైపు పర్యాటక భాగ స్వామ్యాల గురించి చర్చలు జరుపుకుంటూనే, మరోవైపు మన నగరంలోని కనీస పరిశుభ్రతను కూడా కాపాడుకోలేక పోతున్నాం. ప్రజలు కూడా తమ పరిసరాలు కాపాడుకోవడం లేదు. నగరాన్ని చెత్తతో నింపి నరకకూపంగా మార్చేస్తున్నారు. ఇది రకమైన అభివృద్ధి అన్నది ప్రజలు ఆలోచించాలి. ట్రాఫిక్ జామ్‌లు, వరదలొస్తే నాలాలు పొంగడం, రోడ్లు చెరువులను తలపించడం, ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు తలపించడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి దుర్భర పరిస్థితులు మంచిదా అన్నది ప్రజలు కూడా ఆలోచన చేయాలి. ఇది ఖచ్చితంగా మన నగరాన్ని మనమే చేజేతులా నాశనం చేసుకుంటున్నామని గుర్తించాలి. హైదరాబాద్ నగరం గ్లోబల్ వేదికగా మారుతున్న వేళ ప్రజలుగా మనమంతా ఎలా ఉండాలో తెలుసుకోవాలి. అందమైన ఆకాశ హర్మ్యాలు ఉంటే సరిపోదు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు హైదరాబాద్ అందాలను చూసి మురిసి పోవాల్సిందే. అలాగే పరిశుభ్రత కూడా ఇక్కడ ముఖ్యం. అలాగే ఇక్కడ దొరికే తిండి మంచిదనే భరోసా ఉండాలి. సామాన్యుడు కడుపు నిండా భోజనం చేసి, ఆరోగ్యంగా బయటకు వస్తాడనే భరోసా కల్పించడం పాలకుల ప్రాథమిక బాధ్యత.

కానీ, నేడు పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. అధికారులు దాడులు చేసిన ప్రతిసారీ గడువు ముగిసిన నిల్వలు, కుళ్ళిన మాంసం, అపరిశుభ్రమైన వంటశాలలు, ఎలుకలు, బొద్దింకల స్వైరవిహారం దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఒకేరోజులో పుట్టుకొచ్చిన సమస్యలు కావు. సంవత్సరాల తరబడి వ్యవస్థలో పెనవేసుకుపోయిన అవినీతికి, అధికారుల నిర్లక్ష్యానికి, యజమానుల కాసుల కక్కుర్తికి నిదర్శనం. అధికారులు తనిఖీలు చేసి, ఏదో నామమాత్రపు జరిమానాలు విధించి, హోటల్ యజమానిని వదిలేయడం వల్ల వస్తున్న ఉపద్రవంగా గుర్తించాలి. హోటళ్లలో అపరిశుభ్రత, కాలం చెల్లిన పదర్థాలను వాడితే కఠిన చర్యలు ఉండాలి. అవసరమైతే ఆ హోట్‌లను మూసేయాలి. జరిమానాలు విధించాఇ. హోటల్ నిర్వహణలో నిబంధనలు పాటించకపోతే, అది ప్రజారోగ్యంతో చెలగాటంగానే చూడాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నేరంగా పరిగణించి, అందుకు తగ్గట్లుగా కఠిన చర్యలు తీసుకోవాలి. ఆయా హోటళ్ల యజమానులను రక్షించే రాజకీయ దగుల్బాజీలను పట్టుకోవాలి. దాడులు జరిగినప్పుడు కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్లీ మామూలే అనిపించడం వల్లనే ఈ వ్యాపారస్తుల్లో ఏమాత్రం భయం ఉండటం లేదు. నిజానికి, మన నగరం ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఎదగాలంటే, హోటల్ పరిశ్రమలో కఠినమైన 'ఫుడ్సేఫ్టీ ఆడిట్ విధానాన్నితీసుకు రావాలి. నిబంధనలు అతిక్రమించిన హోటల్ లైసెన్స్ ను శాశ్వతంగా రద్దు చేయాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటారన్న భయం కల్పించాలి. అప్పుడే మన హోటల్ వ్యవస్థ బాగుపడుతుంది. లేకుంటే ఇలాగే కుళ్లిన పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగటం తప్పదు.



## త్వరలో బీసీ మహాసభ

### ఉద్యమానికి వైయస్ఆర్‌సీపీ కార్యాచరణ

### ప్రశ్నించిన వైయస్ఆర్‌సీపీ బీసీ నేతలు

తాడేపల్లి, జూలై 06: రాష్ట్రంలో బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం రెండేళ్ల పాలనలో బీసీలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని వైయస్ఆర్‌సీపీ బీసీ సెల్ నాయకులు మండిపడ్డారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమైన బీసీ నేతలు విస్తృతంగా చర్చించారు. బీసీలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ మేరకు వచ్చే నెల విజయవాడలో రాష్ట్రస్థాయి బీసీ సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా, జోనల్ స్థాయిల్లో కూడా సమావేశాలు నిర్వహించి ప్రజలకు చంద్రబాబు ప్రభుత్వ వైఖరిని వివరిస్తామని వెల్లడించారు. మాజీ మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ రెండేళ్ల కూటమి పాలనలో బలహీన వర్గాలపై దాడులు పెరిగాయని, బీసీలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. బీసీలకు చంద్రబాబు ఇచ్చిన హామీలు, చేసిన మోసాలపై ప్రజలకు వాస్తవాలు వివరించాలని సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు. బలహీన వర్గాలంతా ఒక్కతాటిపైకి వచ్చి శక్తివంచన లేకుండా పోరాడతామని పేర్కొన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు తన ప్రభుత్వంలో బీసీ నేత కేఈ కృష్ణమూర్తిని ఉప ముఖ్యమంత్రిగా కొనసాగించారు. కానీ ఇప్పుడు రెండేళ్లుగా బీసీ వర్గానికి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వకపోవడం వెన్నుపోటు కాదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ .. బీసీలకు ఇచ్చిన హామీలకు ఎందుకు తిలోదకాలు ఇచ్చారో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విజయవాడలో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి దేశంలోనే తొలిసారిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సి వస్తోందన్నారు. దీంతో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ రెండేళ్లలో బీసీలను అవమానించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు ఇప్పటికీ డిప్యూటీ సీఎం పదవి ఇవ్వలేదని విమర్శించారు. 50 ఏళ్లు దాటిన బీసీ మహిళలకు పెన్షన్ ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్‌ను 24 శాతానికి తగ్గించే ప్రక్రియలో బిర్రు ప్రతాపరెడ్డితో సుప్రీంకోర్టులో పిటిషన్ వేయించి బీసీలను మోసం చేశారని ఆరోపించారు. ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ మాట్లాడుతూ బీసీలు ఎన్ని అబద్ధాలు చెప్పినా ఓటేస్తారనే భావనతో చంద్రబాబు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో బీసీ నేత పిల్లి సుభాష్ చంద్రబోస్ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. ఇప్పుడు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తారా లేదా ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని వైయస్ఆర్‌సీపీ గొంతునొక్కాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని విజయవాడ సమావేశం ద్వారా ప్రజల ముందుంచి, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరిస్తామని స్పష్టం చేశారు.



## వాల్మీకి/బోయల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్‌కు వినతి

నరసరావుపేట, జూలై 06: పల్నాడు జిల్లాలో వాల్మీకి/బోయ సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వాల్మీకి/బోయ సంఘం నాయకులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ ద్వారా వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు ఓంకార్, నియోజకవర్గ నాయకుడు బొల్లారావు ఆధ్వర్యంలో కార్యదర్శి మల్ల వెంకటేష్, బోడ రాజామోహన్, మినిగా బాబు తదితరులు ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో దాదాపు 24.87 లక్షలకు పైగా ఉన్న వాల్మీకి/బోయలు ఎస్టీ హోదా లేకపోవడంతో అన్ని రంగాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకి/బోయలకు తక్షణమే ఎస్టీ హోదాను పునరుద్ధరించాలని, నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక ఆర్మీ/సెక్యూరిటీ రెజిమెంట్ ఏర్పాటు చేయాలని, వాల్మీకి కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించడంతో పాటు ప్రత్యేక జనగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గత ఐదేళ్లుగా ఎలాంటి నేరాల్లో పాల్గొనని వాల్మీకి యువతపై ఉన్న రౌడీషీట్లను మానవతా దృక్పథంతో తొలగించి, వారి ఉపాధికి మార్గం చూపాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.


## యూకేలో ఉన్నత విద్య.. ప్రపంచ స్థాయి అవకాశాలకు మీ తొలి అడుగు

నేటి పోటీ ప్రపంచంలో అంతర్జాతీయ విద్య విద్యార్థుల భవిష్యత్తును కొత్త స్థాయికి తీసుకెళ్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు తమ విద్యా, ఉద్యోగ మరియు వ్యక్తిగత అభివృద్ధి కోసం విదేశీ విద్యను ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో యునైటెడ్ కింగ్‌డమ్ (UK) అత్యంత ప్రజాదరణ పొందిన విద్యా గమ్యస్థానాలలో ఒకటిగా నిలుస్తోంది.

యూకేలోని విశ్వవిద్యాలయాలు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలు, ఆధునిక పరిశోధన సదుపాయాలు మరియు పరిశ్రమలకు అనుగుణమైన కోర్సులతో ప్రసిద్ధి చెందాయి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది అంతర్జాతీయ విద్యార్థులు యూకేలో ఉన్నత విద్యను అభ్యసిస్తూ తమ కెరీర్‌కు బలమైన పునాది వేస్తున్నారు.

**యూకేలో చదవడం వల్ల కలిగే ప్రయోజనాలు:**

- ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలలో విద్యను అభ్యసించే అవకాశం
- ఇతర దేశాలతో పోలిస్తే తక్కువ వ్యవధిలో డిగ్రీ మరియు మాస్టర్స్ కోర్సులను పూర్తి చేసే అవకాశం
- చదువుతో పాటు వారానికి నిర్ణీత గంటల పాటు పార్ట్-టైమ్ ఉద్యోగం చేసే అవకాశం
- Graduate Route ద్వారా చదువు పూర్తయ్యాక ఉద్యోగ అవకాశాలను అన్వేషించే అవకాశం
- ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన డిగ్రీలు మరియు అర్హతలు
- బహుళ సంస్కృతులు కలిగిన అంతర్జాతీయ వాతావరణంలో నేర్చుకునే అవకాశం
- మీ విదేశీ విద్య ప్రయాణంలో EXXEELLA Educational Group తోడుగా


విదేశీ విద్య కోసం సరైన యూనివర్సిటీ ఎంపిక, కోర్సు ఎంపిక, అప్లికేషన్ ప్రక్రియ, వీసా మార్గదర్శకత్వం వంటి అంశాలు విద్యార్థులకు సవాళ్లుగా మారవచ్చు. ఈ దశలో జుశశజుజుూాూ జుంబష్ఞ్అశీఖ్రీ +తీశీబజూ విద్యార్థులకు సమగ్ర సహాయాన్ని అందిస్తోంది.

**EXXEELLA Educational Group** అనుభవజ్ఞులైన కౌన్సిలర్ల ద్వారా విద్యార్థుల విద్యా అర్హతలు, కెరీర్ లక్ష్యాలు మరియు ఆర్థిక పరిస్థితులను విశ్లేషించి సరైన మార్గదర్శకత్వా న్ని అందిస్తుంది. యూనివర్సిటీ అడ్మిషన్లు, డాక్యుమెంటేషన్, ౹ూ్రా మార్గనిర్దేశం, వీసా ఫైలింగ్ మరియు ప్రీ-డిపార్చర్ సహాయం వంటి సేవలతో విద్యార్థుల విదేశీ విద్య ప్రయాణాన్ని సులభతరం చేస్తోంది.

యూకేలో బ్యాచిలర్స్, మాస్టర్స్ లేదా ఇతర ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ఉన్న విద్యార్థులు సరైన ప్రణాళిక మరియు నిపుణుల మార్గదర్శకత్వంతో తమ కలలను సాకారం చేసుకోవచ్చు.

మీ భవిష్యత్తుకు ప్రపంచ స్థాయి అవకాశాల ద్వారం తెరవాలనుకుంటున్నారా? అయితే ఈరోజే మీ **UK Study Journey**" ప్రారంభించండి.

**Let Exxeella guide you to your dream success!**



...సంప్రదించండి....

**Akhila Gaddameedi**
Senior Adviser
Exxeella Education Group
9854422244
akhila@exxeella.com



## విప్‌ల కార్యాలయాలు, మీడియా అడ్వైజరీ కమిటీ నూతన కార్యాలయాల ప్రారంభం

**హైదరాబాద్, జూలై 6**

తెలంగాణ శాసనసభ భవనంలో అసెంబ్లీ విప్ వేముల వీరేశం, శాసన మండలి విప్‌లు అద్దంకి దయాకర్, బాల్మూరి వెంకట్‌ల నూతన కార్యాలయాలను సోమవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విప్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాసనసభ మీడియా అడ్వైజరీ కమిటీ నూతన కార్యాలయాన్ని కూడా చైర్మన్, స్పీకర్ ప్రారంభించారు. కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, శాసన మండలి కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేజీబీవీ నుంచి మరో విద్యార్థిని అదృశ్యం.. గాలింపు ముమ్మరం

**మంచిర్యాల, జూలై 6**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మరో విద్యార్థిని అదృశ్యం కావడంతో కలకలం రేగింది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న సాయి శ్రుతి ఆదివారం ఉదయం నుంచి కనిపించకుండా పోయినట్లు విద్యాసంస్థ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థిని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, విద్యార్థిని ఎవరికి సమాచారం ఇవ్వకుండా హాస్టల్, కళాశాల ప్రాంగణం నుంచి బయటకు వెళ్లినట్లు గుర్తించారు. ఆమె ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవలే జిల్లాలోని చెన్నూరు మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన తొమ్మిదో తరగతి విద్యార్థినిని పోలీసులు సురక్షితంగా గుర్తించిన విషయం తెలిసిందే. అలాగే జూన్ 25న రెబ్బెన మండలంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల నుంచి మరో విద్యార్థిని వెళ్లిపోయి వారం రోజుల తర్వాత తిరిగి వచ్చిన ఘటన కూడా ఆందోళన కలిగించింది. వరుసగా ప్రభుత్వ నివాస విద్యాసంస్థల నుంచి విద్యార్థినులు అదృశ్యమవుతున్న ఘటనల నేపథ్యంలో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిని ఆచూకీని త్వరగా గుర్తించాలని, కేజీబీవీలు సహా ప్రభుత్వ నివాస విద్యాసంస్థల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని తల్లిదండ్రులు, ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## మహిళా సంక్షేమంపై మంత్రి రాజనరసింహాతో మహిళా కాంగ్రెస్ నేత మయూరి సింగ్ భేటీ

**హైదరాబాద్, జూలై 6**



అఖిల భారత మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి మయూరి సింగ్ సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత, సంక్షేమం, ఆరోగ్య సంరక్షణ, సమగ్ర అభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. మహిళల కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను మహిళా కాంగ్రెస్ ద్వారా మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అంశంపైనా అభిప్రాయాలు పంచుకున్నారు. మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ, మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతను లక్ష్యంగా చేసుకుని తమ శాఖ పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నర్సింగ్ అధికారుల నియామకం, వైద్య విద్య బలోపేతం, మహిళల ఆరోగ్య సేవల విస్తరణ, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీలు) సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. మయూరి సింగ్ మాట్లాడుతూ, తెలంగాణలో మహిళా కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. అదే సమయంలో మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మహిళా కాంగ్రెస్ చురుకైన పాత్ర పోషిస్తుందని మంత్రి రాజనరసింహకు తెలిపారు.

## విపత్తుల సమయంలో తొలి స్పందన దళాలుగా సివిల్ డిఫెన్స్ వాలంటీర్లు

**రెండు విశ్వవిద్యాలయాల్లో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం**

**హైదరాబాద్, జూలై 6**

రాష్ట్రంలో విపత్తు నిర్వహణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు మరియు సివిల్ డిఫెన్స్ శాఖ రెండు విశ్వవిద్యాలయాల్లో ఐదు రోజుల సివిల్ డిఫెన్స్ వాలంటీర్ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి. రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 400 మంది వాలంటీర్లకు అత్యవసర పరిస్థితుల నిర్వహణ, విపత్తు స్పందన అంశాలపై శిక్షణ అందించనున్నారు.

## జూలై 10 కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌కు ఏఐవైఎఫ్ మద్దతు

**హైదరాబాద్, జూలై 6**




ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు ఫీజు నియంత్రణ చట్టం (ఫీ రెగ్యులేషన్ యాక్ట్) తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు జూలై 10న చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌కు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఉన్న ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీయుల్లా ఖాద్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తక్కువ విద్యార్థుల నమోదు పేరుతో ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయడం, కొన్ని విద్యాసంస్థలను మూసివేయడం, ఉపాధ్యాయులు మరియు పరిపాలనా సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రభుత్వ విద్యా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు వంటి కనీస మౌలిక వసతులు కూడా సరిగా లేవని విమర్శించారు. ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తోందని, ఫీజుల నియంత్రణ లేకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ట్యూషన్ ఫీజులు, డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల కోసం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం ఆర్థికంగా బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని, అన్ని బోధన, బోధనేతర ఖాళీలను భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, జాతీయ విద్యా విధానం--2020 (ఎన్‌ఈపీ) అమలుకు ముందు విస్తృత స్థాయి చర్చలు నిర్వహించాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. జూలై 10న జరిగే కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని, ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం విద్యార్థులు, యువజనులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

## శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను మోదీ ప్రభుత్వం సాకారం చేసింది

### బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్, జూలై 6**



భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. సోమవారం రామ్‌నగర్‌లో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ముఖర్జీని జాతీయవాదం, జాతీయ సమైక్యతకు ప్రతీకగా అభివర్ణించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ, “ఒక దేశం--ఒక రాజ్యాంగం” అనే డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2019లో ఆర్టికల్ 370ను రద్దు చేయడం ద్వారా సాకారమైందని పేర్కొన్నారు. భారతీయ జనసంఘ్‌గా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ నాటిన చిన్న మొక్క నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీగా ఎదిగిన భారతీయ జనతా పార్టీ అనే మహావృక్షంగా విస్తరించిందని ఆయన అన్నారు. దేశభక్తి, త్యాగస్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని దత్తాత్రేయ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయి కృష్ణ యాదవ్, ఎం.సి. మోహన్, కౌండిన్య ప్రసాద్, శోభా ఠాకూర్‌తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ చోరీ కేసు ఛేదించిన హుజూర్‌నగర్ పోలీసులు

**నిందితుడి అరెస్టు.. ట్రాక్టర్ స్వాధీనం**




హుజూర్‌నగర్, జూలై 6 సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన ట్రాక్టర్ చోరీ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చరమంద రాజు తెలిపారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం, జూన్ 29న అమరవరం గ్రామానికి చెందిన కొప్పుల వాసిరెడ్డి తన ఇంటి ఆవరణలో నిలిపి ఉంచిన జాన్ డీర్ ట్రాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. మరుసటి రోజు ఉదయం ట్రాక్టర్ కనిపించకపోవడంతో బాధితుడు హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ చలికంటి నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా మఠంపల్లి మండలం అవిరేణికుంట సమీపంలో మట్టిలో దిగబడి ఉన్న ట్రాక్టర్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సాంకేతిక ఆధారాల సాయంతో విచారణ కొనసాగించగా, అదే గ్రామానికి చెందిన చిరంజీవి అనే వ్యక్తి ట్రాక్టర్‌ను దొంగిలించినట్లు నిర్ధారించారు. దీంతో సోమవారం అతడిని అతని నివాసంలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ చరమంద రాజు రైతులకు పలు సూచనలు చేశారు. నాట్ల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ట్రాక్టర్లు, ఇంజన్లు, నాగళ్లు, ఇతర వ్యవసాయ పరికరాలను పొలాల వద్ద నిర్లక్ష్యంగా వదిలివేయకుండా భద్రంగా భద్రపరచుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా చోరీ ఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో పోలీసు సిబ్బంది జానీ, గోలి శంభయ్య తదితరులు పాల్గొన్నారు.


## ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీలో వేగం పెంచాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట జూలై 7 (మన దీపం)**

జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని, ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. హరితహారంలో భాగంగా ఇచ్చే మొక్కలు అన్ని రకాలు ఉండేలా చూడాలని, ప్రజలు నాటుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ఊరూరా పచ్చదనం పరుచుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. కేవలం మొక్కలు నాటడమే కాదు.. వాటిని కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పంచాయతీ రాజ్, మున్సిపాలిటీలు, అటవీ శాఖ, వ్యవసాయం, నీటి పారుదల శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఖాళీ ప్రదేశాలు ఎక్కడ ఉన్నా మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. స్కూళ్లలో పండ్ల మొక్కలు, హాస్టళ్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ పరిసరాల్లో ఎకో క్లబ్ లను యాక్టివేట్ చేసి మొక్కల సంరక్షణ బాధ్యతను అప్పగించాలని సూచించారు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలే కాకుండా పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, పరిశ్రమలు కూడా ఈ వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇండస్ట్రీ మేనేజ్‌మెంట్ తమ పరిసరాల్లో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టాలని స్పష్టం చేశారు. మొక్కలు నాటడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

మొక్కల పంపిణీకి సంబంధించి మున్సిపల్ అధికారులు ముందస్తు ప్లానింగ్‌తో ఉండటంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పోస్టర్లు, ప్రచార చిత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న తీరు బాగుందని మెచ్చుకున్నారు. ఇదే ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్.పి. సిఇఓ శిరీష, హౌసింగ్ పిడి సిద్ధార్థ్, డిఎంహెచ్ఓ వెంకటరమణ డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డిఎఓ శ్రీధర్ రెడ్డి, డిఎఫ్ ఓ దామోదర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై అప్రమత్తత అవసరం

## డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

**కరీంనగర్, జూలై 6**

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జునోటిక్ (శీశీఅశీఱఝ) వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విశ్రాంత ప్రిన్సిపాల్, కాలమిస్ట్, సామాజిక విశ్లేషకులు, లయన్ డాక్టర్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి సూచించారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పద్మానగర్‌లోని మానేరు ఉన్నత పాఠశాలలో శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో నమోదవుతున్న వ్యాధుల్లో సుమారు 70 శాతం జంతువుల నుంచే మనుషులకు సంక్రమిస్తున్నాయని తెలిపారు. ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ 1885 జూలై 6న రేబిస్ వ్యాక్సిన్‌ను కనుగొన్న సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రపంచ జునోసిస్



దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇళ్లలో పెంచుకునే కుక్కలు, పిల్లులు, పందులు వంటి జంతువులతో జాగ్రత్తగా వ్యవహరించాలని, వాటిని ముట్టుకున్న తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. గబ్బిలాల ద్వారా కరోనా వైరస్ వ్యాప్తి చెందిన విషయాన్ని గుర్తుచేస్తూ, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ, రేబిస్, ఎబోలా, మంకీపాక్స్ వంటి వ్యాధులు జునోటిక్ వ్యాధుల కోవకు చెందుతాయని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శాతవాహన లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు లయన్ కడారు అనంతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమకాలీన అంశాలపై అవగాహన పెంపొందించుకొని జనరల్ నాలెడ్జ్‌ను విస్తరించుకోవాలని సూచించారు. ప్రతి ఏడాది నిర్వహించే ముఖ్యమైన జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న కడారు సునితా రెడ్డి వందన సమర్పణ చేయగా, పాఠశాల ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భార్యతో వీడియో కాల్‌లో ఉండగానే రైలు కింద పడి వ్యక్తి మృతి

**వరంగల్, జూలై 6**

వరంగల్ జిల్లా కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్యతో వీడియో కాల్‌లో మాట్లాడుతూనే ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతుడు రాజేష్ నాయక్ (45)గా గుర్తించారు. ఆయన వరంగల్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ ఆస్తి వివాదాల కారణంగా కొంతకాలంగా ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయని సమాచారం. ఆదివారం రాత్రి భార్యతో జరిగిన వాగ్వాదం అనంతరం ఇంటి నుంచి వెళ్లిపోయిన రాజేష్, అనంతరం రైల్వే ట్రాక్ వద్ద నుంచి భార్యకు వీడియో కాల్ చేసి తన ప్రాణాలు తీసుకుంటానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆయన మాటలను భార్య తొలుత తీవ్రంగా పరిగణించలేదని, మరుసటి ఉదయం ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా కాజీపేట రైల్వే పట్టాలపై ఆయన మృతదేహం లభించినట్లు అధికారులు వెల్లడించారు. ఘటనపై ప్రభుత్వ రైల్వే పోలీసులు (GRP) కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నాంపల్లి క్రిమినల్ కోర్టులో అగ్నిప్రమాదం

## ప్రాపర్టీ రూమ్‌లో మంటలు..

## అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది

**హైదరాబాద్, జూలై 6**

హైదరాబాద్‌లోని నాంపల్లి క్రిమినల్ కోర్టు భవనంలో సోమవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుని కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కోర్టు భవనం మూడో అంతస్తులో ఉన్న ప్రాపర్టీ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు.సమాచారం అందుకున్న వెంటనే రెండు అగ్నిమాపక వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. దీంతో మంటలు ఇతర గదులకు వ్యాపించకుండా నివారించగలిగారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదు. అయితే ప్రాపర్టీ రూమ్‌లోని కొన్ని వస్తువులు దగ్ధమైనట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక విచారణలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. మంటల వల్ల జరిగిన నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు సాంకేతిక నిపుణులతో పరిశీలన చేపట్టనున్నారు.



# గ్రామాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

## ప్రిన్సిపాల్ నారు రమణారెడ్డి

**కోదాడ, జూలై 6**

ప్రముఖ జాతీయవాది, కేంద్ర మాజీ మంత్రి, భారత రాజ్యాంగ పరిషత్ మాజీ సభ్యుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని కోదాడలోని కె.ఆర్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, సూర్యాపేట జిల్లా మై భారత్ కేంద్రం (భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ) సంయుక్త ఆధ్వర్యంలో "గ్రామాభివృద్ధిలో యువత పాత్ర" అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, తెలుగు అధ్యాపకుడు వేముల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల విజేతలకు సోమవారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నారు రమణారెడ్డి మాట్లాడుతూ దేశ నిర్మాణం, గ్రామాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన, అక్షరా స్యత పెంపు, సామాజిక రుగ్మతల నిర్మూలనలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. నైపుణ్యా లను పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడే దిశగా యువత ముందుకు సాగాలని కోరారు. సూర్యాపేట జిల్లా మై భారత్ కేంద్రం నిర్వాహకుడు ఎం.కె. నాయక్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వివిధ సేవా, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సేవాభావంతో సమాజ అభివృద్ధికి తోడ్పడుతూ స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా యువత కోసం పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్. పిచ్చిరెడ్డి, జి. యాదగిరి, వి.బాలభీమారావు, ఆర్. రమేష్, కె. రామరాజు, జి.రవికిరణ్, కె. సతీష్, జి. నాగరాజు, పి.తిరుమల, ఇ.నరసింహారెడ్డి, ఎస్.కె. ముస్తఫా, తిరుపతయ్య, ఎస్.కె. ఆరిఫ్, కె. శాంతయ్య, ఎన్. జ్యోతిలక్ష్మి, ఆర్. చంద్రశేఖర్, ఎస్. వెంకటేశ్వరాచారి, టి. మమతతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధం.. భర్త హత్య

**నిజామాబాద్, జులై 6**

నిజామాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించిన ప్రశాంత్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భార్య సంధ్య తన సహచరులు అనిల్, వెంకట సాయి అలియాస్ బంటితో కలిసి హత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం, భార్య సంధ్యకు ఉన్న వివాహేతర సంబంధాన్ని ప్రశాంత్ వ్యతిరేకించడంతో దంపతుల మధ్య తరచూ విభేదాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అతడిని అడ్డు తొలగించాలనే ఉద్దేశంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం హత్యకు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో తేలినట్లు తెలిపారు. హత్యా యత్నం అనంతరం ప్రశాంత్ చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిన సమయంలోనే నిందితులు మరోసారి కుట్ర అమలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# ప్రియురాలిని కలిసేందుకు జైలు గోడ దూకిన రిమాండ్ ఖైదీ

**మహబూబ్‌నగర్, జూలై 6**

మహబూబ్‌నగర్ జిల్లా జైలులో సంచలన ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఓ యువకుడు ప్రియురాలిని కలిసేందుకు సినీ ఫక్కీలో జైలు నుంచి పరారయ్యాడు. నాలుగు టవళ్లను ముడివేసి తాడులా తయారు చేసి జైలు గోడ దూకి తప్పించుకున్నట్లు అధికారులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం, పోక్సో కేసులో అరెస్టైన నిందితుడు ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. ఆదివారం రాత్రి జైలు ప్రహరీ గోడ ఎక్కేందుకు నాలుగు టవళ్లను ముడివేసి తాడులా ఉపయోగించి గోడ దూకి పరారయ్యాడు. అనంతరం తన ప్రియురాలిని కలిసేందుకు వెళ్లినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. సోమవారం ఉదయం ఖైదీల లెక్కింపు సమయంలో అతడు



కనిపించకపోవడంతో జైలు సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఖైదీ కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. జైలు నుంచి ఖైదీ తప్పించుకోవడంపై అధికారులు అంతర్గత విచారణ కూడా ప్రారంభించారు. ఈ ఘటనలో భద్రతా లోపాలపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ఉచిత విద్యాసంస్థలను కొనసాగిస్తాం.. కూల్చితే పది కడతా

## అక్బరుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్, జూలై 6**

తనకు సంబంధించిన విద్యాసంస్థలపై ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గబోనని, ఒక విద్యాసంస్థను కూల్చితే మరో పది విద్యాసంస్థలు నిర్మిస్తానని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. పేదలకు ఉచిత విద్య అందించాలన్న తన లక్ష్యాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆయన అన్నారు. సల్కం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ కేజీ–పజీ క్యాంపస్‌కు సంబంధించిన రికార్డులను సమర్పించాలని ఇటీవల తెలంగాణ హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో అక్బరుద్దీన్ ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యాసంస్థల కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, "ఒక భవంతిని కూల్చినా నేను పది భవంతులు కడతాను. భవనాలు కూల్చినా ఆరుబయట పిల్లలకు బోధిస్తాను కానీ వెనక్కి తగ్గను" అని అన్నారు. అనాథలకు అండగా నిలవడం, మహిళా సాధికారత, పేద విద్యార్థులకు ఉచిత విద్య, నీట్ కోచింగ్ అందించడం తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. తనపై ఒత్తిళ్లు తెచ్చినా ఈ సేవా కార్యక్రమాలు ఆగవని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై ఒకే విధంగా చర్యలు ఉండాలని పేర్కొన్నారు. ఫాతిమా విద్యాసంస్థలకు సంబంధించిన వ్యవహారంలో ప్రభుత్వం హైకోర్టుకు పూర్తి వివరాలు సమర్పించాలని డిమాండ్ చేశారు.

# 2028 జూన్ నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేస్తాం

## నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 6**



దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన అలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం ఎడమ కాలువ (ఏఎంఆర్–ఎస్ఎల్‌బీసీ) సొరంగ నిర్మాణాన్ని 2028 జూన్ నాటికి పూర్తి చేస్తామని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి య న్ . ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పనుల్లో నిమగ్నమైన కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూనే నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని తెలిపారు. సోమవారం సచివాలయంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, కరువు మరియు ఫ్లోరైడ్ సమస్యలతో బాధపడుతున్న దక్షిణ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చే కీలక కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రాజెక్టు అమలులో ఉన్న అన్ని అడ్డంకులను తొలగించి, భూసేకరణ సమస్యలను పరిష్కరించి, సాంకేతిక పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి, సొరంగంతో పాటు కాలువల నిర్మాణాన్ని సమాంతరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశీలన పద్ధతులతో సొరంగ నిర్మాణ పనులను పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటరు మేర పురోగతి సాధించినట్లు మంత్రి తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు పనిచేస్తున్న బృందాల భద్రత కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. సొరంగ నిర్మాణాన్ని మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన మూడు ఆర్మ్ బూమర్లు ఇప్పటికే ముంబై పోర్టుకు చేరుకున్నాయని, ఈ నెలాఖరులోగా పనుల ప్రదేశానికి చేరుకుంటాయని మంత్రి వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి విలువ రూ.12,718 కోట్లుగా ఉందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే మొత్తం 4.01 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, ఫ్లోరైడ్ ప్రభావిత 618 గ్రామాలకు తాగునీరు అందించడంతో పాటు పారిశ్రామిక అవసరాలకు కూడా నీటి సరఫరా జరుగుతుందని వివరించారు. ప్రధాన సొరంగం–1, సొరంగం–2, డిండి భాగం, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా పరిగణించి, నిర్దిష్ట గడువులతో పనులను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# కాళేశ్వరం విషయంలో కేటీఆర్ వ్యాఖ్యలపై ఆది శ్రీనివాస్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, జూలై 6**



కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు వారంలోనే నీటి సరఫరాను పునరుద్ధరించగలమన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు బాధ్యతలు నాలుగేళ్లకు పైగా కేసీఆర్ ప్రభుత్వ చేతుల్లో ఉన్నప్పటికీ మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినకుండా కాపాడడంలోనూ, దెబ్బ తిన్న తర్వాత మరమ్మతులు చేపట్టడంలోనూ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సరైన ప్రణాళిక లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి ప్రజాధనంగా రూ. లక్ష కోట్లను వృథా చేశారని ఆరోపిస్తూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల––ప్రాణహిత ప్రాజెక్టును కమీషన్ల కోసమే పక్కనపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వరదలకు పదేపదే గురవడం ప్రాజెక్టు లోపాలను వెల్లడిస్తోందన్నారు. కాళేశ్వరం ద్వారా ఎత్తిపోసిన నీటిని చివరకు సముద్రంలోకి వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో భారీగా విద్యుత్ వ్యయం జరిగిందని పేర్కొన్నారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి నమోదవుతున్నప్పటికీ, పంటల పరిస్థితిపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం, సాగునీటి నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు.

# విపత్తుల సమయంలో తొలి స్పందన దళాలుగా సివిల్ డిఫెన్స్ వాలంటీర్లు

## రెండు విశ్వవిద్యాలయాల్లో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం

**హైదరాబాద్, జూలై 6**

రాష్ట్రంలో విపత్తు నిర్వహణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు మరియు సివిల్ డిఫెన్స్ శాఖ రెండు విశ్వవిద్యాలయాల్లో ఐదు రోజుల సివిల్ డిఫెన్స్ వాలంటీర్ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి. రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 400 మంది వాలంటీర్లకు అత్యవసర పరిస్థితుల నిర్వహణ, విపత్తు స్పందన అంశాలపై శిక్షణ అందించనున్నారు. అదే సమయంలో హైదరాబాద్‌లోని కోటిలో ఉన్న వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో రెండో విడత శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమంలో 200 మంది సివిల్ డిఫెన్స్ వాలంటీర్లు, 50 మంది అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ, వరదలు, అగ్నిప్రమాదాలు, ఇతర ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వృత్తిపరమైన సహాయక బృందాలు చేరుకునేలోపు తొలి స్పందన దళాలుగా పనిచేసేలా శిక్షణ పొందిన వాలంటీర్ల బృందాన్ని తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. శిక్షణలో భాగంగా రక్షణ చర్యలు, అగ్నిమాపక విధానాలు, ప్రథమ చికిత్స, జనసమూహ నిర్వహణ, విపత్తు సన్నద్ధత, ప్రజల్లో అవగాహన కల్పించడం, సహాయ సామగ్రి పంపిణీ వంటి అంశాలపై సిద్ధాంతపరమైన, ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ వాలంటీర్లు అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, ఎన్‌డీఆర్ఎఫ్‌తో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయంగా పనిచేయనున్నారు.

# జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై అప్రమత్తత అవసరం

## డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

కరీంనగర్, జూలై 6

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జునోటిక్ (శీశీఅశీఱఛి) వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విశ్రాంత ప్రిన్సిపాల్, కాలమిస్ట్, సామాజిక విశ్లేషకులు, లయన్ డాక్టర్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి సూచించారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పద్మానగర్‌లోని మానేరు ఉన్నత పాఠశాలలో శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో నమోదవుతున్న వ్యాధుల్లో సుమారు 70 శాతం జంతువుల నుంచే మనుషులకు సంక్రమిస్తున్నాయని తెలిపారు. ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ 1885 జూలై 6న రేబిస్ వ్యాక్సిన్‌ను కనుగొన్న సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రపంచ జునోసిస్



దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇళ్లలో పెంచుకునే కుక్కలు, పిల్లులు, పందులు వంటి జంతువులతో జాగ్రత్తగా వ్యవహరించాలని, వాటిని ముట్టుకున్న తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. గబ్బిలాల ద్వారా కరోనా వైరస్ వ్యాప్తి చెందిన విషయాన్ని గుర్తుచేస్తూ, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ, రేబిస్, ఎబోలా, మంకీపాక్స్ వంటి వ్యాధులు జునోటిక్ వ్యాధుల కోవకు చెందుతాయని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శాతవాహన లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు లయన్ కడారు అనంతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమకాలీన అంశాలపై అవగాహన పెంపొందించుకొని జనరల్ నాలెడ్జ్‌ను విస్తరించుకోవాలని సూచించారు. ప్రతి ఏడాది నిర్వహించే ముఖ్యమైన జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న కడారు సునితా రెడ్డి వందన సమర్పణ చేయగా, పాఠశాల ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

---

# భార్యతో వీడియో కాల్‌లో ఉండగానే రైలు కింద పడి వ్యక్తి మృతి

వరంగల్, జూలై 6

వరంగల్ జిల్లా కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్యతో వీడియో కాల్‌లో మాట్లాడుతూనే ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతుడు రాజేష్ నాయక్ (45)గా గుర్తించారు. ఆయన వరంగల్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ ఆస్తి వివాదాల కారణంగా కొంతకాలంగా ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయని సమాచారం. ఆదివారం రాత్రి భార్యతో జరిగిన వాగ్వాదం అనంతరం ఇంటి నుంచి వెళ్లిపోయిన రాజేష్, అనంతరం రైల్వే ట్రాక్ వద్ద నుంచి భార్యకు వీడియో కాల్ చేసి తన ప్రాణాలు తీసుకుంటానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆయన మాటలను భార్య తొలుత తీవ్రంగా పరిగణించలేదని, మరుసటి ఉదయం ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా కాజీపేట రైల్వే పట్టాలపై ఆయన మృతదేహం లభించినట్లు అధికారులు వెల్లడించారు. ఘటనపై ప్రభుత్వ రైల్వే పోలీసులు (GRP) కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

---

# నాంపల్లి క్రిమినల్ కోర్టులో అగ్నిప్రమాదం

## ప్రాపర్టీ రూమ్‌లో మంటలు..

## అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది

హైదరాబాద్, జూలై 6

హైదరాబాద్‌లోని నాంపల్లి క్రిమినల్ కోర్టు భవనంలో సోమవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుని కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కోర్టు భవనం మూడో అంతస్తులో ఉన్న ప్రాపర్టీ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే రెండు అగ్నిమాపక వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. దీంతో మంటలు ఇతర గదులకు వ్యాపించకుండా నివారించగలిగారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదు. అయితే ప్రాపర్టీ రూమ్‌లోని కొన్ని వస్తువులు దగ్ధమైనట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక విచారణలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. మంటల వల్ల జరిగిన నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు సాంకేతిక నిపుణులతో పరిశీలన చేపట్టనున్నారు.

---





# గ్రామాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

## ప్రిన్సిపాల్ నారు రమణారెడ్డి

కోదాడ, జూలై 6

ప్రముఖ జాతీయవాది, కేంద్ర మాజీ మంత్రి, భారత రాజ్యాంగ పరిషత్ మాజీ సభ్యుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని కోదాడలోని కె.ఆర్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, సూర్యాపేట జిల్లా మై భారత్ కేంద్రం (భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ) సంయుక్త ఆధ్వర్యంలో "గ్రామాభివృద్ధిలో యువత పాత్ర" అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, తెలుగు అధ్యాపకుడు వేముల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల విజేతలకు సోమవారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నారు రమణారెడ్డి మాట్లాడుతూ దేశ నిర్మాణం, గ్రామాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన, అక్షరా స్యత పెంపు, సామాజిక రుగ్మతల నిర్మూలనలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. నైపుణ్యా లను పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడే దిశగా యువత ముందుకు సాగాలని కోరారు. సూర్యాపేట జిల్లా మై భారత్ కేంద్రం నిర్వాహకుడు ఎం.కె. నాయక్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వివిధ సేవా, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సేవాభావంతో సమాజ అభివృద్ధికి తోడ్పడుతూ స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా యువత కోసం పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్. పిచ్చిరెడ్డి, జి. యాదగిరి, వి.బాలభీమారావు, ఆర్. రమేష్, కె. రామరాజు, జి.రవికిరణ్, కె. సతీష్, జి. నాగరాజు, పి.తిరుమల, ఇ.నరసింహారెడ్డి, ఎస్.కె. ముస్తఫా, తిరుపతయ్య, ఎస్.కె. ఆరిఫ్, కె. శాంతయ్య, ఎన్. జ్యోతిలక్ష్మి, ఆర్. చంద్రశేఖర్, ఎస్. వెంకటేశ్వరాచారి, టి. మమతతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

---

# వివాహేతర సంబంధం.. భర్త హత్య

నిజామాబాద్, జులై 6

నిజామాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించిన ప్రశాంత్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భార్య సంధ్య తన సహచరులు అనిల్, వెంకట సాయి అలియాస్ బంటితో కలిసి హత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం, భార్య సంధ్యకు ఉన్న వివాహేతర సంబంధాన్ని ప్రశాంత్ వ్యతిరేకించడంతో దంపతుల మధ్య తరచూ విభేదాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అతడిని అడ్డు తొలగించాలనే ఉద్దేశంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం హత్యకు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో తేలినట్లు తెలిపారు. హత్యా యత్నం అనంతరం ప్రశాంత్ చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిన సమయంలోనే నిందితులు మరోసారి కుట్ర అమలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

---

# ప్రియురాలిని కలిసేందుకు జైలు గోడ దూకిన రిమాండ్ ఖైదీ

మహబూబ్‌నగర్, జూలై 6

మహబూబ్‌నగర్ జిల్లా జైలులో సంచలన ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఓ యువకుడు ప్రియురాలిని కలిసేందుకు సినీ ఫక్కీలో జైలు నుంచి పరారయ్యాడు. నాలుగు టవళ్లను ముడివేసి తాడులా తయారు చేసి జైలు గోడ దూకి తప్పించుకున్నట్లు అధికారులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం, పోక్సో కేసులో అరెస్టైన నిందితుడు ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. ఆదివారం రాత్రి జైలు ప్రహరీ గోడ ఎక్కేందుకు నాలుగు టవళ్లను ముడివేసి తాడులా ఉపయోగించి గోడ దూకి పరారయ్యాడు. అనంతరం తన ప్రియురాలిని కలిసేందుకు వెళ్లినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. సోమవారం ఉదయం ఖైదీల లెక్కింపు సమయంలో అతడు



కనిపించకపోవడంతో జైలు సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఖైదీ కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. జైలు నుంచి ఖైదీ తప్పించుకోవడంపై అధికారులు అంతర్గత విచారణ కూడా ప్రారంభించారు. ఈ ఘటనలో భద్రతా లోపాలపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

---

# ఉచిత విద్యాసంస్థలను కొనసాగిస్తాం.. కూల్చితే పది కడతా

## అక్బరుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, జూలై 6

తనకు సంబంధించిన విద్యాసంస్థలపై ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గబోనని, ఒక విద్యాసంస్థను కూల్చితే మరో పది విద్యాసంస్థలు నిర్మిస్తానని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. పేదలకు ఉచిత విద్య అందించాలన్న తన లక్ష్యాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆయన అన్నారు. సల్కం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ కేజీ-పజీ క్యాంపస్‌కు సంబంధించిన రికార్డులను సమర్పించాలని ఇటీవల తెలంగాణ హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో అక్బరుద్దీన్ ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యాసంస్థల కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, "ఒక భవంతిని కూల్చినా నేను పది భవంతులు కడతాను. భవనాలు కూల్చినా ఆరుబయట పిల్లలకు బోధిస్తాను కానీ వెనక్కి తగ్గను" అని అన్నారు. అనాథలకు అండగా నిలవడం, మహిళా సాధికారత, పేద విద్యార్థులకు ఉచిత విద్య, నీట్ కోచింగ్ అందించడం తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. తనపై ఒత్తిళ్లు తెచ్చినా ఈ సేవా కార్యక్రమాలు ఆగవని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై ఒకే విధంగా చర్యలు ఉండాలని పేర్కొన్నారు. ఫాతిమా విద్యాసంస్థలకు సంబంధించిన వ్యవహారంలో ప్రభుత్వం హైకోర్టుకు పూర్తి వివరాలు సమర్పించాలని డిమాండ్ చేశారు.

---

# 2028 జూన్ నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేస్తాం

## నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జూలై 6



దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన అలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం ఎడమ కాలువ (ఏఎంఆర్-ఎస్ఎల్‌బీసీ) సొరంగ నిర్మాణాన్ని 2028 జూన్ నాటికి పూర్తి చేస్తామని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి య న్ . ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పనుల్లో నిమగ్నమైన కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూనే నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని తెలిపారు. సోమవారం సచివాలయంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, కరువు మరియు ఫ్లోరైడ్ సమస్యలతో బాధపడుతున్న దక్షిణ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చే కీలక కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రాజెక్టు అమలులో ఉన్న అన్ని అడ్డంకులను తొలగించి, భూసేకరణ సమస్యలను పరిష్కరించి, సాంకేతిక పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి, సొరంగంతో పాటు కాలువల నిర్మాణాన్ని సమాంతరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశీలన పద్ధతులతో సొరంగ నిర్మాణ పనులను పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటరు మేర పురోగతి సాధించినట్లు మంత్రి తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు పనిచేస్తున్న బృందాల భద్రత కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. సొరంగ నిర్మాణాన్ని మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన మూడు ఆర్మ్ బూమర్లు ఇప్పటికే ముంబై పోర్టుకు చేరుకున్నాయని, ఈ నెలాఖరులోగా పనుల ప్రదేశానికి చేరుకుంటాయని మంత్రి వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి విలువ రూ.12,718 కోట్లుగా ఉందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే మొత్తం 4.01 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, ఫ్లోరైడ్ ప్రభావిత 618 గ్రామాలకు తాగునీరు అందించడంతో పాటు పారిశ్రామిక అవసరాలకు కూడా నీటి సరఫరా జరుగుతుందని వివరించారు. ప్రధాన సొరంగం-1, సొరంగం-2, డిండి భాగం, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా పరిగణించి, నిర్దిష్ట గడువులతో పనులను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---

# కాళేశ్వరం విషయంలో కేటీఆర్ వ్యాఖ్యలపై ఆది శ్రీనివాస్ తీవ్ర విమర్శలు

హైదరాబాద్, జూలై 6



కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు వారంలోనే నీటి సరఫరాను పునరుద్ధరించగలమన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు బాధ్యతలు నాలుగేళ్లకు పైగా కేసీఆర్ ప్రభుత్వ చేతుల్లో ఉన్నప్పటికీ మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినకుండా కాపాడడంలోనూ, దెబ్బ తిన్న తర్వాత మరమ్మతులు చేపట్టడంలోనూ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సరైన ప్రణాళిక లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి ప్రజాధనంగా రూ. లక్ష కోట్లను వృథా చేశారని ఆరోపిస్తూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల--ప్రాణహిత ప్రాజెక్టును కమీషన్ల కోసమే పక్కనపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వరదలకు పదేపదే గురవడం ప్రాజెక్టు లోపాలను వెల్లడిస్తోందన్నారు. కాళేశ్వరం ద్వారా ఎత్తిపోసిన నీటిని చివరకు సముద్రంలోకి వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో భారీగా విద్యుత్ వ్యయం జరిగిందని పేర్కొన్నారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి నమోదవుతున్నప్పటికీ, పంటల పరిస్థితిపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం, సాగునీటి నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు.

---

# విపత్తుల సమయంలో తొలి స్పందన దళాలుగా సివిల్ డిఫెన్స్ వాలంటీర్లు

## రెండు విశ్వవిద్యాలయాల్లో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం

హైదరాబాద్, జూలై 6

రాష్ట్రంలో విపత్తు నిర్వహణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు మరియు సివిల్ డిఫెన్స్ శాఖ రెండు విశ్వవిద్యాలయాల్లో ఐదు రోజుల సివిల్ డిఫెన్స్ వాలంటీర్ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి. రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 400 మంది వాలంటీర్లకు అత్యవసర పరిస్థితుల నిర్వహణ, విపత్తు స్పందన అంశాలపై శిక్షణ అందించనున్నారు. అదే సమయంలో హైదరాబాద్‌లోని కోటిలో ఉన్న వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో రెండో విడత శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమంలో 200 మంది సివిల్ డిఫెన్స్ వాలంటీర్లు, 50 మంది అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ, వరదలు, అగ్నిప్రమాదాలు, ఇతర ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వృత్తిపరమైన సహాయక బృందాలు చేరుకునేలోపు తొలి స్పందన దళాలుగా పనిచేసేలా శిక్షణ పొందిన వాలంటీర్ల బృందాన్ని తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. శిక్షణలో భాగంగా రక్షణ చర్యలు, అగ్నిమాపక విధానాలు, ప్రథమ చికిత్స, జనసమూహ నిర్వహణ, విపత్తు సన్నద్ధత, ప్రజల్లో అవగాహన కల్పించడం, సహాయ సామగ్రి పంపిణీ వంటి అంశాలపై సిద్ధాంతపరమైన, ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ వాలంటీర్లు అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, ఎన్‌డీఆర్ఎఫ్‌తో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయంగా పనిచేయనున్నారు.

# కింగ్100లో టబూ విలన్‌గా?





టాలీవుడ్ నటుడు నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందనున్న 100వ చిత్రం 'కింగ్100'పై సినీ వర్గాల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ఇటీవల 'లెనిన్' ప్రీ-రిలీజ్ వేడుకలో పాల్గొన్న నాగార్జున, ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక వివరాలను జులై 10 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించడంతో అభిమానుల దృష్టి ఈ ప్రాజెక్ట్‌పై నిలిచింది. ఈ నేపథ్యంలో చిత్రానికి సంబంధించి పలు వార్తలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

**హైదరాబాద్, జులై 6 :**

తాజా ప్రచారం ప్రకారం ఈ చిత్రంలో బాలీవుడ్ నటి టబూ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఆమె కథలో ప్రతినాయక ఛాయలు ఉన్న శక్తివంతమైన పాత్రలో కనిపించే అవకాశముందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో నాగార్జున, టబూ కలిసి పలు విజయవంతమైన చిత్రాల్లో నటించగా, ఈసారి మాత్రం పూర్తిగా భిన్నమైన పాత్రల్లో తలపడే అవకాశముందని ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.సినీ వర్గాల సమాచారం ప్రకారం దర్శకుడు రా. కార్తీక్ ఈ చిత్రాన్ని సాధారణ స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగే వ్యక్తి జీవితకథ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. తండ్రి--కూతురు మధ్య సాగే భావోద్వేగ కథ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సమాచారం. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో యువ నటి సుష్మిత భట్ కూడా కీలక పాత్రలో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

భారీ వ్యయంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నటీనటులు, టైటిల్, తొలి ప్రచార చిత్రం, చిత్రీకరణ వివరాలను జులై 10 తర్వాత అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.



## సినీ రంగంలో మహిళలకు


# ఇంకా వివక్ష

సినీ పరిశ్రమలో మహిళలు ఇప్పటికీ లింగ వివక్షను ఎదుర్కొంటున్నారని బాలీవుడ్ కథానాయిక కృతి సనన్ వ్యాఖ్యానించారు. కెరీర్ ప్రారంభంలో తాను కూడా ఇలాంటి అనుభవాలను ఎదుర్కొన్నానని ఆమె వెల్లడించారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన కృతి, సినిమా ప్రచార కార్యక్రమాల నుంచి చిత్రీకరణ వరకు మహిళా నటీమణులకు సమాన గౌరవం దక్కని సందర్భాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు.సినిమా ప్రచార కార్యక్రమాల సమయంలో ఓ హీరో తనను ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టేందుకు ప్రయత్నించాడని కృతి గుర్తు చేసుకున్నారు. తాను ఏ ప్రచార కార్యక్రమానికి హాజరుకావాలో కూడా అతడే నిర్ణయించాలనుకున్నాడని తెలిపారు. అలాంటి పరిస్థితి తనకు అవమానంగా అనిపించడంతో, "నా అవసరం లేదనుకుంటే మీరు ఒక్కరే సినిమా ప్రచారం చేసుకోండి" అని చెప్పి వెనక్కి తగ్గినట్లు వెల్లడించారు.సినిమా సెట్స్‌లో కూడా మహిళా నటీమణులు, పురుష నటుల మధ్య స్పష్టమైన తేడా కనిపించేదని కృతి పేర్కొన్నారు. హీరోలకు పెద్ద వానిటీ వాహనాలు, విశాలమైన విశ్రాంతి గదులు, విలాసవంతమైన కార్లు కేటాయిస్తే, హీరోయిన్లకు మాత్రం చిన్న గదులు, సాధారణ వాహనాలు ఇచ్చేవారని చెప్పారు. తనకు అలాంటి సౌకర్యాలపై ఆసక్తి లేకపోయినా, ఈ తేడాలు మహిళలను తక్కువగా చూసే భావనను కలిగిస్తాయని వ్యాఖ్యానించారు.సీనియర్ హీరోలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం సహజమేనని అంగీకరించిన కృతి, కొత్తగా వచ్చిన హీరోల విషయంలో కూడా అదే పరిస్థితి కొనసాగడం సరికాదన్నారు.

# రవితేజ కొత్త చిత్రంపై చర్చ

**హైదరాబాద్, జులై 6 :**

మాస్ మహారాజా రవితేజ వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చిత్రీకరణ చివరి దశకు చేరుకోగా, మరో కొత్త ప్రాజెక్ట్‌కు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. 'రాజా రాజా చోర' చిత్ర దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనున్నట్లు సమాచారం. ఇందులో నటుడు శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశమున్నట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా వినోదం, హాస్యానికి ప్రాధాన్యం ఇస్తూ ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలుపెట్టాలని సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదు.మరోవైపు రవితేజ నటిస్తున్న 'ఇరుముడి' చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందుతోంది. ఇందులో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది.






# ఓటీటీలోకి వస్తున్న 'సింగ్ గీతం'

**హైదరాబాద్, జులై 6 :**

ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన వినూత్న చిత్రం 'సింగ్ గీతం' త్వరలో ఓటీటీ ప్రేక్షకులను అలరించనుంది. విభిన్న కథాంశం, కొత్త తరహా కథనంతో తెరకెక్కిన ఈ చిత్రం జూన్ 12న థియేటర్లలో విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ వాణిజ్యపరంగా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. దర్శకుడు నాగ్ అశ్విన్ సహకారంతో ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ ఈ చిత్రాన్ని నిర్మించింది.

ఈ చిత్రంలో అహల్య, అయాన్, షాలిని కొండేపూడి ప్రధాన పాత్రలు పోషించి తమ సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కొత్త నటీనటులతో రూపొందిన ఈ సినిమా వినూత్నమైన కథనం, భావోద్వేగాలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది.

# త్రిష–రానా బంధంపై మరోసారి వైరల్ చర్చ..



దక్షిణాది స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్, నటుడు రానా దగ్గుబాటి మధ్య ఉన్న స్నేహం గురించి గతంలో ఎన్నో వార్తలు వచ్చాయి. వీరిద్దరి అనుబంధంపై తరచూ చర్చలు జరుగుతూనే ఉంటాయి. ఈ నేపథ్యంలో త్రిష గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రానాతో తనకున్న బంధం గురించి చేసిన వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.త్రిష మాట్లాడుతూ.. తనకు, రానాకు దాదాపు 18 ఏళ్ల వయసు నుంచే పరిచయం ఉందని చెప్పారు. అప్పట్లో తాను చెన్నైలోని టి.నగర్‌లో నివసించేదాన్నని, ఎదురుగా ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు కుటుంబం ఇల్లు ఉండేదని గుర్తు చేసుకున్నారు. రానా కూడా తన బాల్యంలో ఎక్కువ కాలం చెన్నైలోనే గడిపాడని, అలా చిన్నప్పటి నుంచే ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడిందని తెలిపారు.తమ అనుబంధాన్ని త్రిష ఆసక్తికరంగా వివరిస్తూ.. "మా కథకు ముగింపు ఉండదు. కొన్నిసార్లు చాలా మంచి స్నేహితులుగా ఉంటాం. మరికొన్ని సందర్భాల్లో అసలు మాట్లాడుకోం కూడా. మా బంధం ఒక లవ్–హేట్ రిలేషన్‌షిప్‌లాంటిది" అని చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ స్నేహం కొనసాగుతోందని, జీవితంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా పూర్తిగా ఒకరినొకరు దూరం చేసుకోలేని బంధం తమదని వెల్లడించారు.

# యాక్సిడెంట్‌తో కెరీర్‌కు బ్రేక్..

## మళ్లీ జోరు పెంచుతున్న నభా నటేష్



తెలుగు సినీ పరిశ్రమలో ప్రతి ఏడాది కొత్త హీరోయిన్లు ఎంట్రీ ఇస్తూనే ఉన్నారు. వారిలో కొందరు తొలి సినిమాలతోనే స్టార్‌డమ్ అందుకుంటే, మరికొందరు ప్రతిభ ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కించుకోలేకపోతున్నారు. అలాంటి కథానాయికల్లో నభా నటేష్ ఒకరు. అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ భామ కెరీర్ మంచి ఊపులో ఉన్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదం ఆమె సినీ ప్రయాణానికి పెద్ద బ్రేక్ వేసింది.కన్నడకు చెందిన నభా నటేష్.. సుధీర్ బాబు హీరోగా తెరకెక్కిన 'నన్ను దోచుకుందువటే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. అనంతరం పలు చిత్రాల్లో నటించిన నభాకు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' భారీ బ్రేక్ ఇచ్చింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడంతో నభాకు వరుస అవకాశాలు వచ్చాయి.అయితే కెరీర్ జోరుగా సాగుతున్న సమయంలో నభా రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలవడంతో దాదాపు రెండేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. పూర్తిగా కోలుకున్న తర్వాత మళ్లీ సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన ఆమె, తిరిగి వరుస ప్రాజెక్టులతో బిజీ అయ్యింది.రీ–ఎంట్రీ తర్వాత 'డార్లింగ్' చిత్రంలో నటించినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఇటీవల విడుదలైన 'నాగబంధం' చిత్రంతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చిన నభా, ప్రస్తుతం 'స్వయంభు' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి.సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ నభా నటేష్ చురుకుగా ఉంటుంది. తరచూ తన ఫోటోషూట్‌లను అభిమానులతో పంచుకుంటూ ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వరుస సినిమాలతో మరోసారి విజయాల బాట పట్టాలని నభా నటేష్ ఆశాభావంతో ముందుకు సాగుతోంది.



# మూడో టీ20లో భారత్‌కు గెలుపే లక్ష్యం

**నాటింగ్‌హామ్, జులై 6 :**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో నిలదొక్కుకోవాలంటే భారత జట్టు మంగళవారం జరిగే మూడో మ్యాచ్‌లో తప్పనిసరిగా విజయం సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాటింగ్‌హామ్‌లోని ట్రెంట్ బ్రిడ్జ్ మైదానంలో రాత్రి 10 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్ విజయం సాధించి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. దీంతో భారత్‌కు ఈ మ్యాచ్ 'చేయో చావో' పోరుగా మారింది.రెండో టీ20లో భారత జట్టు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ముఖ్యంగా బౌలింగ్‌లో తీవ్ర వైఫల్యం కనిపించింది. స్పిన్నర్ రవి బిష్ణోయ్ నాలుగు ఓవర్లలో 60 పరుగులు సమర్పించుకుని ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతే కాకుండా ఒకే ఓవర్లో వరుసగా మూడు నోబాల్స్ వేయడం జట్టుకు భారీ నష్టాన్ని మిగిల్చింది. ఈ నేపథ్యంలో మూడో మ్యాచ్‌లో బౌలింగ్ కూర్పులో మార్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రవి బిష్ణోయ్ స్థానంలో యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం కల్పించే అవకాశం ఉంది. ప్రసిద్ధ్ కృష్ణ కంటే ప్రిన్స్ యాదవ్‌కే జట్టు యాజమాన్యం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.బ్యాటింగ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రమే రెండు మ్యాచ్‌ల్లోనూ నిలకడగా రాణించాడు. తొలి మ్యాచ్‌లో 59, రెండో మ్యాచ్‌లో 43 పరుగులు చేసి జట్టుకు శుభారంభం అందించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ పరుగులు చేసినప్పటికీ మ్యాచ్‌ను మలిచే స్థాయి ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ కూడా ఈ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకోవాలని భావిస్తున్నాడు.సిరీస్‌లో పోటీ కొనసాగాలంటే భారత జట్టు బ్యాటింగ్‌లో మరింత దూకుడుతో పాటు బౌలింగ్‌లో కచ్చితత్వాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉంది.

# అన్వయ్ ద్రవిడ్ అర్ధశతకం..



## భారత్‌కు గౌరవప్రద స్కోరు

**హంబంటోటా, జులై 6 :**

భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ వారసత్వాన్ని ఆయన చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ ఘనంగా కొనసాగిస్తున్నాడు. శ్రీలంక అండర్-19 జట్టుతో జరిగిన రెండో యువ వన్డేలో అద్భుతమైన అర్ధశతకంతో జట్టును క్లిష్ట పరిస్థితుల నుంచి గట్టెక్కించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. హంబంటోటాలోని మహింద రాజపక్స అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో అన్వయ్ 67 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 87 పరుగులు చేసి భారత జట్టు పోటీ స్కోరు నమోదు చేయడంలో కీలక పాత్ర పోషించాడు.టాస్ గెలిచిన భారత జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే శ్రీలంక బౌలర్లు ఆరంభంలోనే వరుస వికెట్లు పడగొట్టడంతో 19 ఓవర్లు ముగిసే సమయానికి భారత్ 81 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్ అద్భుతమైన ఓర్పుతో పాటు దూకుడైన బ్యాటింగ్ ప్రదర్శించాడు.మరో బ్యాటర్ అర్జున్ రాజ్‌పుత్‌తో కలిసి ఐదో వికెట్‌కు 145 పరుగుల విలువైన భాగస్వామ్యం నెలకొల్పి జట్టును సంక్షోభం నుంచి బయటపడేశాడు. అన్వయ్ 129.85 స్ట్రైక్‌రేట్‌తో వేగంగా పరుగులు చేస్తూ కేవలం 47 బంతుల్లోనే తన తొలి అండర్-19 వన్డే అర్ధశతకాన్ని పూర్తి చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో అద్భుతమైన కవర్ డ్రైవ్‌లు, పుల్ షాట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సెంచరీ దిశగా దూసుకెళు_న్న సమయంలో శ్రీలంక ఎడమచేతి ఫాస్ట్ బౌలర్ గిమ్హాన్ మెండిస్ బౌలింగ్‌లో ఔటై నిరాశగా వెనుదిరిగాడు.అర్జున్ రాజ్‌పుత్ కూడా 81 బంతుల్లో 76 పరుగులు చేసి రనౌట్ అయ్యాడు. వీరిద్దరి భాగస్వామ్యం ముగిసిన తర్వాత భారత బ్యాటింగ్ మళ్లీ కుప్పకూలింది. 263 పరుగుల వద్ద అన్వయ్ ఔటైన అనంతరం టెయిల్ ఎండర్లు ఎక్కువసేపు నిలవలేకపోయారు. చివరి మూడు వికెట్లు కేవలం 22 పరుగుల వ్యవధిలో కోల్పోయిన భారత్ 47.2 ఓవర్లలో 285 పరుగులకు ఆలౌటైంది.శ్రీలంక బౌలర్లలో గిమ్హాన్ మెండిస్ అద్భుతంగా బౌలింగ్ చేసి 41 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. అతని స్పెల్ భారత ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించడంలో కీలకంగా మారింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉండగా, ఈ మ్యాచ్ ఫలితం సిరీస్ విజేతను నిర్ణయించడంలో కీలకంగా మారింది.ఇటీవల ముగిసిన వినూ మాంకడ్ ట్రోఫీలో కర్ణాటక జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అన్వయ్ ద్రవిడ్ 220 పరుగులు చేసి తన ప్రతిభను చాటుకున్నాడు. ఇప్పుడు శ్రీలంకపై అద్భుత ఇన్నింగ్స్ ఆడి రాబోయే అండర్-19 ప్రపంచకప్ జట్టులో స్థానం దక్కించుకునే అవకాశాలను మరింత బలపరిచాడు.



## ఐర్లాండ్ షాక్‌తో తేరుకుంటుందా

# టీమిండియా?

**లండన్, జులై 6 :**

ఒకప్పుడు పొట్టి ఫార్మాట్‌లో ప్రత్యర్థి జట్లకు కంటిమీద కునుకు లేకుండా చేసిన భారత జట్టు ఇప్పుడు వరుస పరాజయాలతో విమర్శలు ఎదుర్కొంటోంది. మూడు సార్లు టీ20 ప్రపంచ విజేతగా నిలిచిన భారత్, గత రెండేళ్లలో ద్వైపాక్షిక సిరీస్‌లు, ఆసియా కప్‌లలో ఆధిపత్యం చాటినా.. ఇటీవల మాత్రం అదే జోరును కొనసాగించలేకపోతోంది. ముఖ్యంగా ఐర్లాండ్ చేతిలో 2-0తో సిరీస్ కోల్పోవడం, అనంతరం ఇంగ్లండ్ పర్యటనలోనూ ఆశించిన ప్రదర్శన చేయలేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేసింది.సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో అద్భుత విజయాలు సాధించిన జట్టు, శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో ఎందుకు తడబడుతోంది? అనే చర్చ క్రికెట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత భారత్ వరుసగా ఎనిమిది ద్వైపాక్షిక సిరీస్‌లు, ఆసియా కప్‌ను సొంతం చేసుకుని ప్రపంచ క్రికెట్‌లో తిరుగులేని జట్టుగా ఎదిగింది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్ వంటి బలమైన జట్లను సైతం ఓడించి సత్తా చాటింది. అయితే ఇప్పుడు ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురికావడం భారత జట్టు ప్రతిష్ఠకు గట్టి దెబ్బగా మారింది.ఈ ఫలితంతో ఇతర జట్లలో కూడా భారత్‌ను ఓడించగలమనే ఆత్మవిశ్వాసం పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.





# వైభవ్ సూర్యవంశీ చరిత్ర..

## అతి పిన్న వయసులో టీమిండియా అరంగేట్రం

**మాంచెస్టర్, జులై 7 :**

భారత క్రికెట్‌లో మరో చారిత్రక ఘట్టం నమోదైంది. బీహార్‌కు చెందిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసి కొత్త రికార్డు సృష్టించాడు.అతి పిన్న వయసులో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆటగాడిగా నిలిచిన వైభవ్..టెస్ట్ హోదా కలిగిన దేశాల తరఫున టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగానూ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.వైభవ్‌కు జట్టులో అవకాశం కల్పించడంలో ఆలస్యం జరిగిందంటూ ఇటీవల కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కావాలనే అతడి అరంగేట్రాన్ని వాయిదా వేస్తున్నారంటూ పలువురు అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పందిస్తూ అన్ని విమర్శలకు తెరదించారు.ప్రతిభకు మాత్రమే భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రాధాన్యం ఇస్తుందని, ఎవరికీ అన్యాయం జరిగే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. వైభవ్‌కు సరైన సమయంలోనే అవకాశం లభించిందని, జట్టు యాజమాన్యం తీసుకున్న నిర్ణయం సముచితమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో వైభవ్ మరింత రాణించి భారత జట్టులో కీలక ఆటగాడిగా ఎదుగుతాడనే విశ్వాసం వ్యక్తం చేశారు.కేవలం 15 ఏళ్ల 99 రోజుల వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన వైభవ్ సూర్యవంశీ ఈ క్రమంలో భారత దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న సుదీర్ఘకాల రికార్డును అధిగమించాడు.




# ట్రంప్ జోక్యంతో ఫుట్‌బాల్‌లో వివాదం

**ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో అమెరికా జట్టు కీలక దశకు చేరుకున్న వేళ ఓ నిర్ణయం తీవ్ర చర్చకు దారితీసింది. అమెరికా స్టార్ ఫార్వర్డ్ ఆటగాడు ఫోలారిన్ బలోగన్‌పై విధించిన ఒక మ్యాచ్ నిషేధాన్ని ఎత్తివేసినట్లు వెలువడిన వార్తలు ఫుట్‌బాల్ వర్గాల్లో వివాదానికి కారణమయ్యాయి. ఈ నిర్ణయం వెనుక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకున్నారనే ప్రచారం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.**

**న్యూయార్క్, జులై 6 :**

రౌండ్-32లో బోస్నియాతో జరిగిన మ్యాచ్‌లో ఫోలారిన్ బలోగన్‌కు రెడ్ కార్డు చూపించడంతో నిబంధనల ప్రకారం అతనిపై ఒక మ్యాచ్ నిషేధం అమలైంది. సాధారణంగా రెడ్ కార్డు పొందిన ఆటగాడు తదుపరి మ్యాచ్‌కు దూరంగా ఉండాల్సి ఉంటుంది. దీంతో బెల్జియంతో జరగనున్న రౌండ్-16 కీలక మ్యాచ్‌లో బలోగన్ అందుబాటులో ఉండడంపై సందిగ్ధత నెలకొంది.ప్రస్తుత టోర్నీలో అమెరికా తరఫున ఇప్పటికే మూడు గోల్స్ సాధించిన బలోగన్ జట్టుకు కీలక ఆటగాడిగా నిలిచాడు. ఈ నేపథ్యంలో అతనిపై విధించిన నిషేధాన్ని తొలగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫుట్‌బాల్ ప్రపంచ సమాఖ్య అధికారులను కోరినట్లు అంతర్జాతీయ మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. అనంతరం నిషేధాన్ని ఎత్తివేస్తూ బలోగన్‌కు బెల్జియంతో జరిగే మ్యాచ్‌లో ఆడేందుకు అనుమతి లభించినట్లు ప్రచారం జరుగుతోంది.ఈ నిర్ణయాన్ని బెల్జియం ఫుట్‌బాల్ సమాఖ్య తీవ్రంగా వ్యతిరేకించింది. రెడ్ కార్డు పొందిన ఆటగాడిపై అమలులో ఉన్న నిషేధాన్ని ఇలా ఎత్తివేయడం నిబంధనలకు విరుద్ధమని అభిప్రాయపడింది. దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వెలువడటంతో ఈ అంశం మరింత చర్చనీయాంశమైంది.ఫుట్‌బాల్ ప్రపంచ సమాఖ్య అధ్యక్షుడు జియన్ని ఇన్‌ఫాంటినోతో ట్రంప్ నేరుగా మాట్లాడి రెడ్ కార్డు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరినట్లు సమాచారం. అనంతరం తన సామాజిక మాధ్యమ ఖాతాలో ఫుట్‌బాల్ ప్రపంచ సమాఖ్యకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపినట్లు కూడా వార్తలు వచ్చాయి.అయితే ఈ వ్యవహారంపై ఫుట్‌బాల్ ప్రపంచ సమాఖ్య నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

“This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467